ప్రభుత్వ బడి.. సమస్యల ఒడి

- శిథిలావస్థకు తరగతి గదులు
- పాఠశాలల చుట్టూ గోడలు లేక మందుబాబులకు అడ్డా
- కరెంటు వసతి లేక విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు
- ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య


ప్రహరీలేని సుందరగిరి పాఠశాల (ఇన్‌సెట్లో) కొండాపూర్‌లో పెచ్చులూడుతున్న తరగతి గది పైకప్పు

➡ మండలంలోని 17 గ్రామాల్లో తొమ్మిది జెడ్పీ, ఆదర్శ, కేజీబీవీ, రెండు స్కూల్ కాంప్లెక్స్, ఇరవై ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి.

➡ మొత్తం 3,197 మంది విద్యార్థులు చదువుతున్నారు

చిగురుమామిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తరగతి గదులు శిథిలావస్థకుచేరాయి. ప్రహరీలు లేక రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వం మరమ్మతులకు నిధులు విడుదల చేయడంలేదు. గతేడాది ప్రభుత్వం మనఊరు–మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా పది పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేశారు. మండలంలో మొత్తం 34 ప్రభుత్వ పాఠశాలలున్నాయి, ఇంకా 24 స్కూళ్లలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

కుంటుపడుతున్న విద్యాభివృద్ధి

మౌలిక వసతులు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతోంది. రన్నింగ్ వాటర్ లేక మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. స్కావెంజర్ల దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వంట గదులు లేక ఆరుబయట, తాత్కాలిక రేకుల షెడ్డు కింద మధ్యాహ్న భోజనం వండుతున్నారు.

శిథిలావస్థకు చేరిన తరగతి గదులు

కొన్ని గ్రామాల్లో తరగతి గదులు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉపాధ్యాయులు చెట్లకింద పాఠాలు బోధిస్తున్నారు. కొన్ని ఊర్లలోని గదులు శిథిలావస్థకు చేరాయి. విద్యాకమిటీ ఛైర్మన్లు తీర్మానాలు చేసి మండల విద్యావనరుల కేంద్రానికి పంపారు. పాఠశాలల చుట్టూ గోడలు లేక విద్యార్థులు పాఠాలు నేర్చుకోలేకపోతున్నారు. సుందరగిరి జెడ్పీఎస్ చుట్టూ ప్రహరీ లేదు, బొమ్మనపల్లి జెడ్పీపాఠశాల ప్రహరీ ఐదేళ్ల క్రితం భారీ వర్షాలకు కూలిపోయింది. రహదారి పక్కనే పాఠశాల ఉండటం వల్ల వాహనాల శబ్దాలకు చదువు చెప్పలేని పరిస్థితి, సెలవు రోజుల్లో ఆకతాయిలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులకు చెప్పినా ఫలితం లేదని స్థానిక నేతలు వాపోతున్నారు. పాఠశాలల్లో ఇటీవల కరెంటు సౌకర్యం ఏర్పాటు చేశారు. అన్ని గదుల్లో ఫ్యాన్ల సౌకర్యం లేక వేసవిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉక్కపోత భరించలేకపోతున్నారు. రక్షిత మంచినీరు అందక అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామ పంచాయతీల నుంచి వారానికోసారి వచ్చే నల్లానీరు సరిపోవడం లేదు. విద్యార్థులకు లైబ్రరీసౌకర్యం కల్పించాల్సి ఉన్నప్పటికీ ఆ ఊసేలేదు. కనీస వసతులు లేక తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గిపోతుంది. సర్కారీ స్కూళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి.ఆటవస్తువులు లేక విద్యార్థులు క్రీడల్లో పాల్గొనలేకపోతున్నారు. ఖాళీ మైదానంలో ముచ్చట్లకే పరిమితమవుతున్నారు. సరిపడా ఆటవస్తువులను పంపించడంలేదు. పది మంది ఆడితే ఇరవైమంది ఖాళీగా ఉంటున్నారు. పాఠశాల స్థాయి క్రీడలను ప్రోత్సహించేందుకు తగిన వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

కొత్త గదులు నిర్మించాలి



జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో గదులు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం చేసి పంపాం. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా పలుమార్లు ప్రస్తావించాం. అయినా స్పందనలేదు.

– భూంరెడ్డి, సర్పంచ్, బొమ్మనపల్లి

నిధులు మంజూరు చేయాలి



మా గ్రామంలోని జెడ్పీపాఠశాల చుట్టూ కంపౌండు లేదు. దీంతో కొందరు పోకిరీల ఆటలకు అడ్డుఅదుపులేదు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు, ఎమ్మెల్యేకు విన్నవించాం. ఇప్పటికైనా తగిన నిధులు మంజూరు చేయాలి.

– రవీందర్, సర్పంచ్, ముదిమాణిక్యం

నివేదిక పంపాం



శిథిలావస్థకు చేరిన వాటి స్థానంలో నూతన గదులు నిర్మించాలని ఉన్నత అధికారులకు విన్నవించాం. పది పాఠశాలల్లో మనఊరు మనబడి మరమ్మతులు కొనసాగుతున్నాయి. మిగతా స్కూళ్లలో మరమ్మతు కోసం నిధులు మంజూరవుతాయి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ, చిగురుమామిడి

ఉపాధ్యాయులకు శిక్షణ, అవగాహన


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్


ఇల్లందకుంటలో...

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల ఇంగ్లిష్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్, తొలిమెట్టుపై సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయుల లక్ష్య కార్యక్రమాలపై శుక్రవారం ప్రత్యేక అవగాహన కల్పించారు. ఎంఈవో విడుపు శ్రీనివాస్, జిల్లా పరిశీలకులు వినయదర్ రాజు, సరిత హాజరై మాట్లాడారు. టీచర్లు ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు అంశాలను పాఠశాల స్థాయిలో అమలు చేయాలన్నారు. అందులో భాగంగా ప్రణాళిక సిద్ధం చేసుకొని రాబోయే రోజుల్లో పరిశీలకులు సందర్శనకు వచ్చినప్పుడు రికార్డులన్ని చూపాలని, ప్రగతిని విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. కోర్స్ డైరెక్టర్లుగా సదానందం, సమ్మయ్య, మండల నోడల్ అధికారి పద్మ, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వేణుగోపాల్, కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ఉమ్మారెడ్డి, వేణుగోపాల్‌చారి, సంపత్, శ్యామ్‌కుమార్, సీఆర్పీలు రవి, సురేష్, రాంబాబు, మహేందర్, ఆయా స్కూళ్ల టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల తెలుగుభాషా ఉపాధ్యాయులకు, ప్రాథమిక పాఠశాల స్థాయి ఇల్లందకుంట మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు వేదికల వద్ద స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాలకు జిల్లా పరిశీలకులుగా ఎస్.శ్రీధర్ హాజరయ్యారు. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్యసాధన కార్యకమాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు తెలుసుకున్న అంశాలను తదనంతరం తప్పకుండా అమలు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధిగా పాఠ్య, పీరియడ్ ప్రణాళికలు సిద్ధం చేసుకుని రాబోయే రోజుల్లో పరిశీలకులు పాఠశాల సందర్శనకు వచ్చినప్పుడు చూపాలని తెలిపారు. నేటి వరకు జరిగిన ప్రగతిని కూడా విశ్లేషణ చేయడం జరిగిందన్నారు. కోర్సు డైరెక్టర్లుగా సాంబయ్య, మాలతి, శిక్షణ రిసోర్స్ పర్సన్‌లుగా కె.రవి, సమ్మయ్య, భాస్కర్‌రెడ్డి, లక్ష్మి, కుమారస్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు, మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పరమేశ్వర్, శ్రీనివాస్, శృతకీర్తి పాల్గొన్నారు.

శంకరపట్నం: మానకొండూర్, శంకరపట్నం మండలాలకు చెందిన ప్రాథమికోన్నత పాఠశాలల గణితం ఉపాధ్యాయులతో శుక్రవారం మండలంలోని మొలంగూర్ జడ్పీహెచ్ఎస్‌లో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల ప్రగతి, బోధన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీఆర్పీలు శ్రీనివాస్, మహేశ్, హెచ్ఎం నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఓటింగ్‌పై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ నవీన్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్దనే ఓటింగ్ చేసే విధానంపై బీఎల్‌వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయ అధికారి, తహసీల్దార్ నవీన్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ఇప్పటికే అర్హులైన దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అందజేశామన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన తేదీ రోజున దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారందరినీ అందుబాటులో ఉండేలా బీఎల్‌వోలు చూడాలన్నారు. ఓటర్లందరికీ పోల్‌చిట్టీలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి సరస్వతి, సీడీపీవో ఉమారాణి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న చొప్పదండి మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌లతో పాటు గాంధీనగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సిబ్బందితో కలిసి సందర్శించారు. ఓటర్లకు మెట్లతో పాటు దివ్యాంగులకు ర్యాంపు ఏర్పాటు చేస్తున్నామని, ఎలక్ట్రిక్ లైట్లు, ఫ్యాన్‌లు, తాగునీరు, మరుగుదొడ్డి వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డి. ప్రశాంత్ కుమార్, ఏఈ రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే 2 లక్షల ఉద్యోగాలు

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: సీఎం కేసీఆర్ ఉద్యోగం పోతే 2 లక్షల ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు చెబుతున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ వీరన్న నాయక్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర హుస్నాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లనే నిరుద్యోగులకు ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏడాది లోపు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రజల ఆకాంక్షను నేరవేర్చింది కాంగ్రెస్

సీపీఐ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యేల పోరాట ఫలితంగా దివంగతవైఎస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మించి నియోజకవర్గ ఆకాంక్షలు నేరవేర్చారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు.


కాంగ్రెస్‌లో చేరికలు

నియోజకవర్గంలోని ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, యువకులు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చిగురుమామిడి మండల జెడ్పీటీసీ గీకురు రవీందర్, కన్నారం ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.


కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం రామ్‌నగర్, మంగళపల్లి గ్రామాలకు చెందిన 80 మంది నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎంపీ, హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అలంకారప్రాయమేనా..!



టవర్‌సర్కిల్‌లో వెలగని స్ట్రీట్ లైట్లు

- టవర్‌సర్కిల్ వద్ద వెలగని స్మార్ట్ స్ట్రీట్ లైట్లు
- హౌసింగ్‌బోర్డులో ప్రారంభం కాని వైనం

కరీంనగర్ కార్పొరేషన్: నగరానికి వాణిజ్య కేంద్రమైన టవర్‌సర్కిల్ వద్ద స్మార్ట్ స్ట్రీట్ లైట్లు అలంకారప్రాయంగా మిగిలాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో వీధిదీపాలు వెలగడం లేదు. స్మార్ట్ సిటీలో భాగంగా ఏడాదిక్రితం నగరంలోని ప్రధాన వీధుల వెంట స్మార్ట్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశారు. ముందుగా కలెక్టరేట్ రోడ్‌లో ఏర్పాటు చేయగా, ఆ తర్వాత నగరంలోని ఇతర ప్రధాన రహదారులు, పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా టవర్‌సర్కిల్ ప్రాంతంలోనూ ఏర్పాటు చేసి ఆరు నెలల క్రితం ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ లైట్ల నిర్వహణ అంతంతమాత్రంగానే సాగుతోంది. ఈ క్రమంలో 45 రోజులు నుంచి లైట్లు వెలగడం లేదు. కేబుల్ సమస్య కారణంగానే ఈ లైట్లు వెలగడం లేదని అధికారులు నిర్ధారించారు. లైట్ల సామర్థ్యానికి తగిన విధంగా కేబుల్ లేకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తేలగా, కనీసం లైట్ల సామర్థ్యం కూడా చూడకుండా కేబుల్ ఎలా వేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలో చేపడుతున్న పనుల్లో చాలా చోట్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఈ జాబితాలో తాజాగా స్ట్రీట్ లైట్లు కూడా చేరడం విశేషం. నగరానికి ప్రధాన ఆకర్షణగా ఉండే టవర్‌సర్కిల్ వద్దనే స్ట్రీట్‌లైట్లు వెలగకపోతే మిగతా ప్రాంతాల్లో వాటి నిర్వహణ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించొచ్చు.

హౌసింగ్‌బోర్డులో ప్రారంభం కాని లైట్లు

స్మార్ట్‌సిటీలో భాగంగా మోడల్ కాలనీగా అభివృద్ధి చేసిన హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇప్పటివరకు స్మార్ట్ స్ట్రీట్ లైట్లు ప్రారంభం కాలేదు. కాలనీవ్యాప్తంగా దాదాపు 200 వరకు లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు, వాటికి బాక్స్‌లు కూడా అమర్చారు. ఇప్పటి వరకు విద్యుత్‌కనెక్షన్ ఇవ్వకపోవడంతో వినియోగంలోకి రావడం లేదు. కాలనీవాసులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. స్మార్ట్ స్ట్రీట్ లైట్ల కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలనే ట్రాన్స్‌కో సూచన మేరకు పెండింగ్ పడ్డట్లు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో, సంవత్సర కాలంగా అవి అలంకారప్రాయంగా మిగిలాయి. ఇప్పటికైనా టవర్‌సర్కిల్‌లో స్మార్ట్ స్ట్రీట్ లైట్ల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని, హౌసింగ్‌బోర్డుకాలనీలో లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త కేబుల్ వేస్తున్నాం

టవర్‌సర్కిల్‌లో స్మార్ట్ స్ట్రీట్ లైట్లకు కొత్త కేబుల్ వేస్తున్నాం. పాత కేబుల్ స్థానంలో కొత్త కేబుల్ వేసే పనులు కొనసాగుతున్నాయి. వారం పదిరోజుల్లో పనులు పూర్తి చేసి స్ట్రీట్ లైట్లు వెలిగిస్తాం.

– గఫూర్, ఏఈ, నగరపాలక సంస్థ

పైకప్పులు వేశారూ..



సాక్షి స్పందన

రామడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ గేట్‌వాల్వ్‌లపై పైకప్పులు వేయాలని మిషన్ భగీరథ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. 'సాక్షి' పత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'ప్రాణాలు పోతున్నాయి...' కథనానికి అధికారులు స్పందించారు. గేట్‌వాల్వ్‌లపై పైకప్పులు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమస్యపై కథనం ప్రచురించి పరిష్కారం చూపినందుకు ప్రజలు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత కుట్టుశిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

మానకొండూర్‌రూరల్: అభయ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఉచిత కుట్టుశిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఔత్సాహికులు 9640789108 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా కోఆర్డినేటర్ అరుణప్రభంజన్ తెలిపారు. ఇప్పటివరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కుట్టుశిక్షణ తరగతులు నిర్వహించి 200 మందికి సబ్సిడీ ద్వారా కుట్టుయంత్రాలు పంపిణీ చేశామని ఆమె తెలిపారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


విద్యుత్ సరఫరా బంద్



జమ్మికుంట: పట్టణంలోని అబాది జమ్మికుంట 33/11కేవీ పరిధిలో శనివారం విద్యుత్ మేంటేన్స్ పనుల కారణంగా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ఏఈ సురేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కృష్ణకాలనీ, ఎంప్లాయీస్, టీచర్స్ కాలనీలు , కొత్తమార్కెట్, బస్టాండ్, గాంధీచౌక్ ఏరియాలు, శాలవాడ, సివిల్‌ఆసుపత్రి ఏరియా, అబాది జమ్మికుంట, కేశవపూర్‌లో ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నమని ప్రజలు, వ్యాపారులు గమనించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి ముస్లింల మద్దతు

శంకరపట్నం: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తామని మానకొండూర్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ కన్వీనర్ మహమ్మద్ రహీమొద్దీన్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నామని అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ముస్లింల జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించలేదని ఆరోపించారు. పంచాయతీల నుంచి పార్లమెంట్ వరకు మైనార్టీలకు అవకాశాలు కల్పించడంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. ఈకార్యక్రమంలో జహీద్, ఖాద్రి, ఆరిఫ్, రియాజ్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రహీం

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం


హుజూరాబాద్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ గెలుపే లక్ష్యంగా నాయకులు ఇంటింటికి తిరిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 13వ వార్డు ఇందిరానగర్ కాలనీలో పట్టణ మహిళా అధ్యక్షురాలు ఏముల పుష్పలత కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు.

చిత్ర కథ — బడి ఆవరణే తెలంగాణ క్రీడా ప్రాంగణం



కరీంనగర్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతీ ఊరిలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. అయితే కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ స్థలా లు అందుబాటులో లేకపోవడంతో అధికారులు పాఠశాలల్లోనే క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. దుబ్బపల్లి, ఫకీర్‌పేట, తాహెర్‌కొండాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసి యువకులు వ్యాయామం చేసేందుకు వీలుగా పరికరాలను అమర్చారు.